క్లుప్తంగా

9 నుంచి తెనాలిలో పునరుత్థాన పండుగలు

తెనాలిఅర్బన్: హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 12 వరకు 15వ పునరుత్థాన పండుగలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చెంచుపేటలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని ఇండోర్ స్టేడియం దగ్గర రోజూ ఉదయం 11 గంటలకు, సాయంత్రం 6 గంటలకు కూడికలు జరుగుతాయని చెప్పారు. పాస్టర్ ఆనంద్ జయకుమార్, బ్రదర్ సాల్మన్, పాస్టర్ అక్షయ్, పాస్టర్ జెబరాజ్ దైవ సందేశాన్ని అందిస్తారని తెలిపారు.

ప్రజలకు సత్వర సేవలు అందించండి

తెనాలిఅర్బన్: సచివాలయానికి వచ్చిన ప్రజలకు సత్వర సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదేశించారు. పట్టణంలోని 22, 23 వార్డుల్లోని సచివాలయాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట మేనేజర్ అప్పలరాజు ఉన్నారు.

నవ్వుతో షుగర్ నియంత్రణ

గుంటూరు మెడికల్: ప్రతిరోజూ హాయిగా నవ్వటం వల్ల శరీరంలోని ఒత్తిడి (స్ట్రెస్) హార్మోన్స్ తగ్గి రక్తంలో షుగర్ అదుపులో ఉండటానికి అవకాశాలు ఉన్నాయని పరిశోధనలో తేలిందని గుంటూరు ఎస్.వి.ఆర్. డయాబెటిస్ సెంటర్‌కు చెందిన సీనియర్ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వీవీ రామ్‌కుమార్ చెప్పారు. చెన్నై ఐటీసీ గ్రాండ్ చోళాలో (ఫిబ్రవరి 4, 5 తేదీలు) శనివారం, ఆదివారం సైంటిఫిక్ ప్రోగ్రామ్ డిబేట్ 2023 సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ నవ్వటం వల్ల అధిక రక్తపోటు, గుండె జబ్బులను, కిడ్నీ వ్యాధులను నివారించవచ్చని పరిశోధనలో తేలిందన్నారు. లాఫ్టర్ యోగా చేయటం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తగ్గటంతోపాటు శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వెల్లడించారు. షుగర్ వ్యాధి చికిత్సలో నవ్వును ఎలా ఉపయోగించాలి, లాఫ్టర్ థెరపీ గురించి సదస్సులో డాక్టర్ రామ్‌కుమార్ వివరించారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని ద్రోహం

లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి తీరని ద్రోహం జరిగిందని, ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టు కేటాయించలేదని విద్యావేత్త బి.సి.హెచ్. అనంతరామయ్య అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బడ్జెట్ సమావేశంపై సోమవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన బడ్జెట్‌లో ప్రత్యేక హోదా, వెనుకబడ్డ జిల్లాల ప్యాకేజీల ప్రస్తావనే రాలేదన్నారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్ళయినా రాష్ట్ర విభజన చట్టంలో రాష్ట్రానికి పేర్కొన్న అనేక హామీలను ఈ బడ్జెట్‌లో పేర్కొనలేదన్నారు. కేంద్ర విద్యా సంస్థలకు గతేడాది కేటాయించిన నిధుల్లో కూడా తగ్గించారని విమర్శించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్లేషకులు ఎస్.సదాశివం మాట్లాడుతూ పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు కేంద్ర బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేసి పక్కనున్న ఆంధ్రప్రదేశ్ పట్ల వివక్షత చూపించటం దారుణమన్నారు. పోలవరం అమరావతి నిర్మాణం, విశాఖ ఉక్కుపైనా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావన లేదని పేర్కొన్నారు. పోలవరానికి 2023-24 బడ్జెట్‌లో ఒక్కరూపాయి కూడా కేటాయించలేదని త్వరలో ఎన్నికలు జరుగనున్న కర్ణాటకలోని అప్పర్ భద్ర నీటి ప్రాజెక్టుకు మాత్రం బడ్జెట్ ఏకంగా రూ.5300 కోట్లు కేటాయించారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు వెంకటరత్నం, గుప్తా, మురళీకృష్ణ, సుబ్బారెడ్డి తదితరులు ప్రసంగించారు.

వెటరన్ క్రీడాకారుల అద్భుత ప్రదర్శన

గుంటూరు వెస్ట్ (క్రీడలు): వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈనెల 2 నుంచి 5 వరకు జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారని జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు రాయపాటి రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి మొత్తం 15 మంది పాల్గొనగా అందులో ఐదు పతకాలు సాధించారని పేర్కొన్నారు. వీరిలో పతకాలు సాధించిన వారు త్వరలో గోవాలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

న్యాయ సహాయం అందించడానికి కృషి

గుంటూరు లీగల్: సమస్యలు ఎదురైనప్పుడు న్యాయ సహాయం అందించి వారికి అండగా నిలిచేందుకు న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు కృషి చేస్తున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నకుమార్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సోమవారం ఇంటర్నేషనల్ జస్టిస్ ఇండియా వారితో కలిసి మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బంధంపై ఒకరోజు వర్క్‌షాప్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. కె.రత్నకుమార్ మాట్లాడుతూ వన్ స్టాప్ క్రైసిస్ బృందాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బాధితులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ తరఫున విలియమ్ క్రిస్టఫర్ మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బంధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రేస్ క్రిస్టెఫర్, ఐజెఎం సభ్యులు, పలువురు న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

మీ సచివాలయం-మీ ఎమ్మెల్యే

- వినూత్న కార్యక్రమంతో ప్రజల ముందుకు ఎమ్మెల్యే శివకుమార్
- తొలిరోజున అత్తలూరివారిపాలెంలో విజయవంతంగా నిర్వహణ



ఫుట్‌బ్రిడ్జి నిర్మాణం వినతిపై బ్యాంక్ కెనాల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రజలకు గరిష్టస్థాయిలో సంక్షేమాన్ని అందించటం, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ప్రత్యేకతను నిలుపుకుంటున్న తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రచ్చబండ తరహాలో 'మీ సచివాలయం-మీ ఎమ్మెల్యే' కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. సచివాలయం పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లతో సమావేశం కావటం.. పెండింగు సమస్యల నుంచి, గ్రామ అవసరాలు, వ్యక్తిగత అంశాలతో సహా అన్నింటినీ సవివరంగా చర్చించటం, పరిష్కరించటం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. సమావేశం అనంతరం అవసరమైన పనులను స్వయంగా పరిశీలించాలని ఎమ్మెల్యే భావించారు. తొలిరోజున కొల్లిపర మండల గ్రామం వల్లభాపురం సచివాలయం-1 పరిధిలోని అత్తలూరివారిపాలెంలో మధ్యాహ్నం 'మీ సచివాలయం-మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శివకుమార్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుంటుపల్లి జమున, ఎంపీపీ భీమవరపు పద్మావతి, తెనాలి యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత, తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి పద్మావతీదేవి, అవుతు పోతిరెడ్డి, రమేష్ హాజరయ్యారు. గ్రామ జనాభా 442 మంది కాగా, అక్కడ 152 కుటుంబాలు నివసిస్తున్నాయి. 150 రేషను కార్డులు ఉన్నాయి. 110 ఇళ్లు ఉన్నాయి. మొత్తం 332 మంది ఓటర్లు ఉన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలో ఇప్పటివరకు రూ.1.10 కోట్లు నేరుగా లబ్ధిదారులకు అందినట్టు ఎమ్మెల్యే శివకుమార్ వెల్లడించారు. సంక్షేమ పథకాల అర్జీలన్నీ పరిష్కరించినట్టేనని తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనం మంజూరైందని తెలిపారు. భూముల సర్వేకు 2019 ముందు నుంచీ పెండింగులో ఉన్నవాటితో సహా 90 అర్జీలు ఉండగా, 70 పూర్తయినట్టు సర్వేయరు వెల్లడించారు. మిగిలినవాటిపై రైతుల అభ్యంతరాలు ఉన్నందున, రీసర్వే చేయాల్సి ఉందని తెలిపారు. గడప గడపకు మంజూరైన నిధుల్లో రూ.4.50 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తిచేశారు. గ్రామస్తులు కోరినట్టుగా దెబ్బతిన్న 20 విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి, మరో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనట్టు సభాముఖంగా చెప్పారు. ప్రతి నెల నాలుగో సోమవారం 104 వాహనం వస్తోందనీ, 30 మంది వరకు ఓపీ పరీక్షలకు హాజరవుతున్నట్టు రికార్డుల్లో చూశారు.

ప్రాథమిక పాఠశాల పునరుద్ధరణ

గ్రామస్తుల కోరికపై వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించటం, ప్రమాదకరంగా మారిన పాడుబడిన బావిని పూడ్పించటం, దళితుల శ్మశానవాటికకు వెళ్లే మార్గాన్ని సర్వే చేయించి, హద్దులు నిర్ణయింపజేయటం, ఎస్సీ కాలనీలో చర్చికి కాంపౌండు వాల్ ఏర్పాటు, కొన్ని రోడ్ల నిర్మాణం వంటి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే శివకుమార్ అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. వ్యక్తిగత అభ్యర్థనలపై ఉపసర్పంచ్ బొడ్డు అంజలికి ఇంటిస్థలం మంజూరుకు, మరొకరు కోరిన మేరకు వీధిదీపం ఏర్పాటుకు హామీనిచ్చారు. పంట పొలాలకు వెళ్లేందుకు రేపల్లె బ్రాంచి కెనాల్‌పై ఫుట్‌బ్రిడ్జి ఏర్పాటు అంశంపై వినతి రాగా, స్వయంగా అక్కడికెళ్లి ఎమ్మెల్యే పరిశీలించారు. తొలిరోజున సరికొత్త కార్యక్రమం ఫలవంతమైందని గ్రామస్తులు, అధికారులు ఆనందం వ్యక్తంచేశారు.

వీఆర్వో లాగిన్‌లో నమోదు చేయొచ్చు



వీఆర్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవిబాబు

తెనాలిరూరల్: భూముల రీ సర్వే, ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తున్న సందర్భంలో వాటి వివరాలను వీఆర్వో లాగిన్ ద్వారా నమోదు చేయవచ్చని తహసీల్దార్ కె.రవిబాబు చెప్పారు. వీఆర్వోలతో సోమవారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ కాని భూముల వివరాలు, కొనుగోలు చేసినా పేర్లు ఆన్‌లైన్‌లో మారనివి, తల్లిదండ్రులు రాసిచ్చినా పిల్లల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాని వివరాల మార్పులకు గతంలో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేదని, ఇప్పుడు వీఆర్వోల లాగిన్‌లో నమోదు చేయవచ్చని స్పష్టం చేశారు. నీటి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని, సచివాలయాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. పని వేళల్లో ఎక్కడికి వెళ్లేది ఖచ్చితంగా సచివాలయాల్లో తెలియజేయాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ వెంట డీటీ హెనాప్రియ, ఆర్ఐ కరిముల్లా తదితరులు ఉన్నారు.

క్విజ్‌లో విజేతలకు సర్టిఫికెట్లు



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసిన రమేష్ తదితరులు

తెనాలిరూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలులో ఇటీవల విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆ కార్యక్రమంలో 7, 8, 9, 10 తరగతులకు చెందిన 40 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం స్కూలు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో–ఆర్డినేటర్ బందెల రమేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

చిరుధాన్యాల పంటలను ప్రోత్సహించాలి

లాం ఫామ్ శాస్త్రవేత్త నగేష్



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ నగేష్

తెనాలిటౌన్: రైతులు పంటల మార్పిడిని చేపట్టాలని, చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించాలని లాం ఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నగేష్ కోరారు. కొలకలూరులోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ చిరుధాన్యాలు సంవత్సరం-2023పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ నగేష్ మాట్లాడుతూ రైతులకు చిరుధాన్యాలు పోషక విలువలు వాటి ఉపయోగాల గురించి తెలియజేశారు. రాగులు, సజ్జలు సాగులోకి తీసుకురావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 సంవత్సరాన్ని చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించినట్లు తెలిపారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కిషోర్ మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్న సాగు ఎక్కువగా జరగడం వల్ల భూ సారం తగ్గిపోతుందన్నారు. చిరుధాన్యాల వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని, భూసారం పెరుగుతుందని చెప్పారు. రైతులకు సలహాలు, సూచలను ఇచ్చారు. సదస్సులో డాక్టర్ పుష్పరాణి, ఆర్బీకేల వ్యవసాయ సహాయకులు నాగరాజు, నాగేంద్ర, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్నేహ, శిరీష, ఆస్వతి, రిష్ట, ప్రియాంక, ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

గుడివాడలో కుష్ఠుపై అవగాహన



తెనాలిటౌన్: గుడివాడ గ్రామంలో సోమవారం కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులతో సూపర్‌వైజర్ జి.శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి గురించి ప్రజలకు తెలియజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, హెచ్ఈఓ టి.నాగరాజు, సూపర్‌వైజర్లు లక్ష్మీ ప్రసన్న, శ్రీనివాసరావు, ఏఎన్ఎం చంపావల్లరి, హెచ్ఎం శరత్, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా స్వామి రథోత్సవం



స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజున సోమవారం శ్రీ చక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో యాజ్ఞికులు రఘురామ్, నాగమారుతీ వైదిక క్రతువును ఆగమయుక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, ఎస్‌బి శివ, కార్యక్రమాలను పర్యవేక్షించారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ పరిశోధకుడికి డాక్టరేట్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (హెచ్‌ఆర్ఎం) పరిశోధకుడు పెండెం చంద్రబాబుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం పరీక్షల కో–ఆర్డినేటర్ డాక్టర్ కె సోమశేఖర్ తెలిపారు. హెచ్ఆర్ఎం పరిశోధనా పర్యవేక్షకుడు డాక్టర్ బి.నాగరాజు పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ హెచ్ ఆర్ ఇన్ ఎంప్లాయి ఎంప్లాయిమెంట్ ఇన్ సెలెక్ట్ హెల్త్ కేర్ యూనిట్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు చెప్పారు. చంద్రబాబు పదేళ్లుగా విజయవాడలోని ఆయుష్ ఆస్పత్రిలో హెల్త్ సెక్టార్‌లో పనిచేస్తున్నారు. చంద్రబాబుకు ఆయుష్ ఆస్పత్రి యాజమాన్యం అభినందనలు తెలిపింది.

ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకంపై బంధువుల నిరసన

- వేధింపుల వల్లే మృతిచెందాడంటూ మృతుడి బంధువుల ఆందోళన
- ఆర్థిక నేరం మోపి మనస్తాపానికి గురిచేశారంటూ వెల్లడి
- మృతుడు అరండల్‌పేట 6వలైనులోని ఓ ఆసుపత్రిలో గుమాస్తా



మృతదేహంతో ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు

గుంటూరు ఈస్ట్: ప్రైవేటు ఆసుపత్రి ఉద్యోగి మృతికి ఆసుపత్రి యాజమాన్యం వేధింపులే కారణమని మృతుని బంధువులు ఆసుపత్రి ముందు ధర్నాకు దిగారు. మృతుడి భార్య మానస తెలిపిన వివరాల ప్రకారం బొంగరాలబీడు నిరుపేదల కాలనీ 1వలైనులో నివశించే వంగల మహేష్ (32) అరండల్‌పేటలోని ఓ ఆసుపత్రిలో ఫార్మసీ విభాగంలో బిల్లులు, అకౌంట్స్ గుమస్తాగా మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఆసుపత్రి నిర్వాహకులు రెండు నెలల క్రితం బిల్లుల్లో అవకతవకలు జరిగాయంటూ మహేష్‌ను ఉద్యోగం నుంచి తీసివేశారు. అయితే అకౌంట్స్ మొత్తం సరిచేయాలంటూ తరచూ ఆసుపత్రికి పిలుస్తున్నారు. ఈ క్రమంలో మహేష్ గురువారం ఆసుపత్రికి వచ్చి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం పక్షవాతంతో ఇంట్లో పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతనిని తొలుత నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి అనంతరం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రి యాజమాన్యం వేధింపుల కారణంగానే మహేష్ తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. మృతదేహాన్ని ఆసుపత్రి వద్దకు తీసుకొచ్చి సెల్లార్‌లో ఉంచారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు ధర్నాకు దిగారు. అరండల్‌పేట ఎస్‌హెచ్‌ఓ రామా నాయక్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఒప్పుకోలేదు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: బాలికతో అపార్టుమెంట్ వాచ్‌మెన్ అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. నవభారత్ నగర్‌లోని ఓ అపార్టుమెంట్ వాచ్‌మెన్ రఘు అపార్టుమెంట్ సమీపంలోని ఓ కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక వాచ్‌మెన్ ప్రవర్తనను తల్లిదండ్రులకు చెప్పడంతో వారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మసీ పట్టభద్రులు వ్యవస్థాపకులుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ పట్టభద్రులు వ్యవస్థాపకులుగా ఎదగాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం బి.ఫార్మసీ, ఫార్మా.డి, డి.ఫార్మసీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో ముందుగా ప్రముఖ దర్శకుడు కళా తపస్వి కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఉద్యోగాల కోసం అన్వేషించకుండా ఔషధ సంస్థలను స్థాపించి, ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ కళాశాలలో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని తాము నిర్దేశించుకున్న గమ్యానికి చేరుకోవాలని సూచించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా సీనియర్ విద్యార్థులు తమ జూనియర్లకు నిర్వహించిన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జూపూడి రంగరాజును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్ బీ వ్యాక్సిన్లు వేయించుకోండి

జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ సౌభాగ్యవాణి

తెనాలిఅర్బన్: హెచ్ఐవీ సోకిన వారికి ఎక్కువగా హెపటైటిస్ బీ సోకే అవకాశం ఉందని, అందరూ తప్పని సరిగా వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి సూచించారు. తెనాలి జిల్లా వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన హెపటైటిస్ బీ వ్యాక్సిన్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ హెపటైటిస్ బీ వ్యాక్సిన్‌ను రాష్ట్రంలోని అన్ని ఏఆర్‌టీ సెంటర్‌లలో ఉచితంగా వేస్తున్నట్లు చెప్పారు. జ్వరం, అలసట, ఆకలిలే కపోవటం, వికారం, వాంతులు, కడుపునొప్పి, మూత్రం రంగు మారటం, కామెర్లు వంటివి వ్యాధి లక్షణాలని తెలిపారు. ప్రతిఒక్కరూ మూడు డోసులను వేయించుకోవాలని సూచించారు. అనంతరం వ్యాక్సిన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేష్, ఏఆర్‌టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహశ్రీ పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు ఆంజనేయ శర్మకు సన్మానం



ఆంజనేయశర్మను సన్మానిస్తున్న వెంకటేశ్వరరావు, సాంబశివరావు తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం ఎదురీత చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం ఇంటిగుట్టు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, రంగస్థల కళాకారుడు ఆర్‌వీఎస్ ఆంజనేయ శర్మను సన్మానించారు. కార్యక్రమంలో అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, యల్లంకి సాంబశివరావు, జానకిరామయ్య, గుమ్మడి ప్రసాద్, తరణి హేమంత్ కుమార్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఎన్‌టీఆర్ జగన్, అసాది అక్కిరెడ్డి, బడుగు శ్రీను, పీవీ కృష్ణ, వేములపల్లి సుబ్బారావు, నల్లూరి శ్రీనివాస్, మహేష్, రియాజ్ పాల్గొన్నారు.

ఆరు నెలల్లో సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 29వ వార్డులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 29వ వార్డు సుల్తానాబాద్ వీవర్స్ కాలనీ నుంచి సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 29వ వార్డు కౌన్సిలర్ రమావత్ కవితాభాయ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ మాలోతు బిక్షాలు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు రమావత్ శ్రీను నాయక్ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీధి స్తంభాలు, వీధి లైట్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని వీవర్స్ కాలనీ వాసులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాలతోపాటు రోడ్లు, కాల్వలను నిర్మించాలని కోరారు. 20 రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మిగిలిన మౌలిక వసతులు రానున్న రోజుల్లో సాధ్యమైనంత త్వరగాకల్పిస్తామని చెప్పారు.

త్వరలో ఇళ్లస్థల పట్టాలు

ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వార్డులోని ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను నోట్ చేసుకున్నామని, ఆర్థిక అంశాలతో కూడిన వాటిని మినహా మిగిలిన వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తెనాలి పట్టణంలోని 29, 32 వార్డులలో 60 ఏళ్ల నుంచి కొందరు ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, వారికి ఇప్పటి వరకు ఎవరూ పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. వీటి విషయమై కలెక్టర్‌తో మాట్లాడామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి తగిన ఆదేశాలు రావాల్సి ఉందని, రాగానే ఇలాంటి వారందరికీ ఇళ్ళ స్థల పట్టాలు ఇస్తామని పేర్కొన్నారు. అలాగే 29వ వార్డులో బీసీలకు, ఎస్టీలకు వేరువేరుగా కమ్యూనిటీ హాల్స్ నిర్మించేందుకు చర్యలు చేపట్టామని, అవసరమైన నిధులనూ సమకూర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, 29వ వార్డు నాయకులు బలుగూరి సురేష్, వెంకటేశ్వర్లు, కొతవరపు రమణ, యనమల ఈశ్వర్, మల్లెల యల్లమంద, రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, కేసరి కృష్ణారెడ్డి, చుండూరి వెంకటేశ్వరరావు, కఠారి హరీష్, చుండూరు సాయి, బండ్లమూడి భాస్కరరావు, రావి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నుల బహూకరణ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తెనాలిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో పాత సత్యనారాయణ టాకీస్ రోడ్డులోని మున్షీ మస్తాన్ మున్సిపల్ ఉర్దూ స్కూల్‌లోని విద్యార్థులకు సోమవార నోట్‌బుక్స్, పెన్నులు బహూకరించారు. క్లబ్ సభ్యులు లయన్ కిక్కుర్తి చిన్నకృష్ణారెడ్డి సహకారంతో సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్య జ్ఞానాన్ని కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో లయన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్, అయినాల మల్లేశ్వరరావు, కె.రమేష్ కృష్ణ, హెచ్ఎం షేక్‌దిల్‌బహార్, ఉపాధ్యాయులు షేక్ రబియా, షకీల, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెవరం గ్రామ చెరువులో మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

తెనాలిరూరల్: కలెవరం గ్రామంలోని చెరువులో మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆ చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి జేబులో ఉన్న ఐడీ కార్డుల ఆధారంగా అతన్ని గుంటూరు అమరావతి రోడ్డుకు చెందిన శ్రీకాంత్(30)గా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. రెండు రోజుల క్రితం తెనాలిలోని సోదరి ఇంటికి వచ్చిన అతను కలెవరం ఎందుకు వెళ్లాడు, చెరువులో పడి ఎలా మృతిచెందాడన్న వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న కోణంలోనూ విచారిస్తున్నారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు

లక్ష్మీపురం: గుంటూరు చిన్నబజార్ సెంటర్‌లోని చిన్న మౌలా పంజా అషుర్ ఖానాలో హజరత్ సయ్యద్ షా ఔలియా, హజరత్ సిద్ధి బాబా సిద్ధిక్ అమ్మాజన్ వారి దర్గాలో ఉరుసు వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని దర్గా ముతవల్లి ఖాదర్ బాబా సోమవారం వెల్లడించారు. మంగళవారం గంధం ఉత్సవం, 8న బుధవారం దీపారాధన, 9వ తేదీ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.